క్లుప్తంగా

నరమాలకు ఎమ్మెల్సీ పరామర్శ



వెంకటరమణయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట: విద్యానగర్‌కు చెందిన ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్యను సోమవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. వెంకటరమణయ్య మనవరాలు అక్షిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ వారి నివాసానికి వెళ్లి, అక్షిత చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం వెంకటరమణయ్య, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, వజ్జా రామచంద్రారెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని వేంకటేశ్వరపురం ఎస్టీకాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పెంచలయ్య తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సోమవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాలకు వచ్చే విద్యార్థులందరినీ గైర్హాజరు కాకుండా బడికి పంపుతామని తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు తేజోవర్మ పాల్గొన్నారు.

దాతలకు సన్మానం



దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వాకాడు: మండలంలోని ముట్టెంబాక ప్రభుత్వ పాఠశాలకు సహాయ సహకారాలు అందించిన దాతలను సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం టీవీ రమణయ్య మాట్లాడుతూ చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు కాలినడకన రావడానికి ఇబ్బందులు పడుతున్న క్రమంలో సర్పంచ్ ఎస్ అనిల్‌కుమార్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి ఆటో సౌకర్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పించిన దాతలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎఫ్ఏసీ ఎంపీడీఓగా అప్పాజీ

రాపూరు: స్థానిక ఎఫ్ఏసీ ఎంపీడీఓగా అప్పాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కలువాయి ఎఫ్ఏసీ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తూ రాపూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరాజులు గుంటూరుకు బదిలీ అయ్యారు.

పేద విద్యార్థుల ఉన్నతికి చర్యలు



మాట్లాడుతున్న హెచ్ఎం

చిల్లకూరు: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని చింతవరం జెడ్పీ హైస్కూలు హెచ్ఎం శివసుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని చింతవరం జెడ్పీ హైస్కూలులో సోమవారం ఆణిముత్యాలు పంపిణీ, తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై నేడు ఎంతో మంది నమ్మకాన్ని పెంచుకుంటున్నారన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓ

చిల్లకూరు: స్థానిక ఎంపీడీఓగా జీకే నిర్మలాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్తూరు జిల్లా ఐరాల ఎంపీడీఓగా పని చేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా చిల్లకూరు ఎంపీడీఓగా ఇక్కడికి వచ్చారు. చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అన్నంరెడ్డి పరంధామరెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను సత్కరించారు.

కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

రాపూరు: మండలంలో కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు వేపినాపి పీహెచ్‌సీ వైద్యుడు సూర్యధర్మతేజ తెలిపారు. రాపూరు మండలం నాగవారిపల్లె, రాపూరు ప్రాంతాల్లో సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాపూరులో ఒక కుష్టువ్యాధి కేసును గుర్తించామన్నారు. అతనికి పూర్తి స్థాయిలో వైద్యపరీక్షలు చేసి, మందులు అందిస్తామని తెలిపారు.

మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దు



నాయుడుపేటలో విద్యార్థులు, పోలీసుల మానవహారం

గూడూరు: యువత మత్తు పదార్థాలతో జీవితాలను చిత్తు చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసుశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ విజయ్‌కుమార్, గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు, రెండో పట్టణ సీఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విముక్తులు కావాలి

నాయుడుపేటటౌన్: మత్తు పదార్థాల వ్యసనాల నుంచి విముక్తులు కావాలని, ప్రాణహాని కలిగించే వీటిని విడనాడాలని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూ వీఎస్ ప్రసాద్, సీఐ నరసింహారావు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఎస్ఈబీ, పోలీసు అధికారుల సారథ్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలకు అలవాటు పడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలను నియంత్రించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందన్నారు. వీటి వాడకంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అలాగే సైబర్ నేరాలకు గురి కాకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై పెళ్లకూరు, దొరవారిసత్రం ఎస్ఐలు కృష్ణారెడ్డి, తిరుమలరావు అవగాహన కల్పించారు. గంజాయి, గుట్కా, హాన్స్ ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నా, అక్రమంగా రవాణా చేస్తున్నా, నిల్వ ఉన్న వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులు, పోలీసులు, వార్డు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీకాంత్, వేణు, విక్రమ్ కళాశాల కరస్పాండెంట్ కే సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు

తడ: మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీస్, ఎస్ఈబీ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐటీఐ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో ఏఎస్ఐ శ్రీకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. చిన్నతనంలోనే గుట్కా, గంజాయి, డ్రగ్స్ వినియోగించడంతో జీవితాలు నాశనం అయిపోతాయని హెచ్చరించారు. మత్తుకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

మత్తు పదార్థాల విక్రయం నేరం

సూళ్లూరుపేట: మత్తు పదార్థాలను విక్రయించడం, వినియోగించడం నేరమని, వాటితో యువత పెడదారి పడుతోందని సూళ్లూరుపేట సీఐ వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక సెబ్ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. గోకులకృష్ణ కళాశాల, ఫార్మసీ కళాశాల విద్యార్థులతో కలిసి పోలీసులు సెబ్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేసి, బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకంతో నాడీవ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సీఐ సూర్యనారాయణ, ఎస్ఐలు పూరి రవిబాబు, శ్రీనివాసులురెడ్డి, శశికుమార్, గోకులకృష్ణ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.

వెంకటగిరి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. ఇంటర్‌నేషనల్ యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా పట్టణంలోని కళాశాల విద్యార్థులతో ర్యాలీ చేసి, త్రిభువని సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎందరో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తల్లిదండ్రులకు తీరని శోకం మిగులుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహారావు, సెబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







గూడూరు: ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ, సీఐలు, సూళ్లూరుపేటలో విద్యార్థుల మానవహారం, వెంకటగిరి: త్రిభువని సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం గోనుపల్లి సచివాలయం పరిధిలోని పెంచలకోన, గోనుపల్లిలోని రవీంద్రారెడ్డి కాలనీ, గోనుపల్లి బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేసి, వారి సమస్యలను తెలుసుకున్నారు. పలు చోట్ల రామ్‌కుమార్‌రెడ్డిని ప్రజలు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమను ఇంటింటికీ పంపుతున్నారని తెలిపారు. అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తాను ఎల్లవేళలా ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించే శక్తి ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డీ నారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎన్ రవీంద్రారెడ్డి, పెంచలకోన ఆలయ చైర్మన్ సీ తిరుపాల్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ప్రసన్న, ఎంపీపీ ప్రసన్న, గోనుపల్లి సర్పంచ్ నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పీ దయాకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన



ముమ్మాయిపాళెంలో మహిళలకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే



మాచవరంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నేతలు

ఓజిలి: పేద ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకొచ్చి పథకాలను అమలు చేస్తున్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని, రానున్న ఎన్నికల్లో తిరిగి ఆయన్నే గెలిపించుకుందామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని ముమ్మాయిపాళెం, మాచవరం గ్రామాల్లో సోమ వారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, మండల నాయకులను స్థానిక నాయకులు సన్మానించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి, బుక్‌లెట్లను అందజేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు, సర్పంచ్‌లు పీ మౌనికారెడ్డి, ఎస్ సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్ సంధ్యారాణి, సచివాలయం కన్వీ నర్ ఈ చిన్న పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ నాయ కులు పుల్లారెడ్డి, పీ మధుసూదన్‌రెడ్డి, మహేంద్ర, వెంకటేశ్వర్లు, రవి, సురేష్ పాల్గొన్నారు.

నగదు ప్రోత్సాహకాల పంపిణీ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

గూడూరురూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక ఎస్టీ బాలికల గురుకులం విద్యార్థినులకు సోమవారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. బ్యూరో ఆఫ్ సోషల్ సర్వీసెస్, ఇన్నర్ వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కమిటీ డివిజన్ సభ్యుడు కూరపాటి రవీంద్రబాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గిరిజన బాలికలు పది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రోత్సాహకాలు అందజేసే కార్యక్రమానికి నాంది పలికిన సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సువర్ణ, మినీ గురుకులం హెచ్ఎం మేరీ ప్రియత, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు జీవనిరెడ్డి, విష్ణువందన, సుప్రభ, శశిరేఖ, గురుకులం ఇన్‌చార్జి వార్డెన్ రాజేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో నేడు ప్రవేశ పరీక్ష

చిల్లకూరు: ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు చిల్లకూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మీరా సాహెబ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు గురుకుల కన్వీనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు గతంలో నాయుడుపేటలో ప్రవేశపరీక్ష జరుపుతున్నట్లు ప్రకటించారని, అయితే ఆయా పాఠశాలలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆ పాఠశాలలోనే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డుతో రావాలన్నారు.

బహుమతుల ప్రదానం



విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులతో దాతలు

వాకాడు (చిట్టమూరు): చిట్టమూరు మండలం మెట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం నెల్లూరుకు చెందిన ముసునూరు లక్ష్మీకుమారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ముఖిల్, నారాయణ, మధుకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 కేవీఎస్ ప్రసాద్, సేవా సంస్థ అధ్యక్షుడు శంకరయ్య, హెచ్ఎం కె మీనాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో సమస్యలు దూరం



కడివేడు రెవెన్యూ సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ బాలాజీ

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వేతో సమస్యలు దూరం కానున్నాయని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ అన్నారు. మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలోని ఆముదాల కండ్రిగలో జరుగుతున్న రీ సర్వేని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఎక్కువగా ప్రభుత్వ భూములున్న విషయాన్ని గుర్తించి, ఎంత మేరకు ఉండవచ్చనే విషయాలను మ్యాప్‌లో పరిశీలించి, అడిగి తెలుసుకున్నారు. ఆముదాల కండ్రిగ ప్రాంతంలో చెరువులో సాగువుతున్న జామాయిల్‌ను పరిశీలించి, ఎవరు సాగు చేశారన్న విషయంపై ఆరా తీయాలని సూచించారు. అనంతరం చిల్లకూరు రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వేని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో హద్దురాళ్లను ఏర్పాటు చేయడంలో అలసత్వం పాటిస్తున్నారని, త్వరగా వాటిని ఏర్పాటు చేసి, పక్కాగా పాస్ పుస్తకాలను అందించేలా చూడాలన్నారు. ఆయన వెంట గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వే ఏడీ జయరాజ్, ఇన్‌స్పెక్టర్ మునుస్వామి, డీఐ హరోహర, సర్వేయర్ రామ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

ఉన్నత విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శంకరయ్య

పెళ్లకూరు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని పేద విద్యార్థులందరూ ఉన్నత విద్యనభ్యసించాలని ఎంఈఓ శంకరయ్య అన్నారు. మండలంలోని నెలబల్లి, కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

పెళ్లకూరు: మండలంలోని పునబాకలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని గ్రామపెద్దలు సోమవారం జిల్లా దేవాదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై స్పందించిన దేవాదాయశాఖ అధికారి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పునబాక గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా అర్జీలు రాసే సెంటర్ ఏర్పాటు



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: ప్రతి సోమవారం స్పందనకు వచ్చే ప్రజలకు ఉచితంగా అర్జీలు రాసి ఇచ్చేందుకు ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశామని, వలంటీర్లకు సమస్యను తెలియజేస్తే ఉచితంగా అర్జీలు రాసిస్తారని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఉచితంగా అర్జీలు రాసే కేంద్రాన్ని ఆర్డీఓ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి డివిజన్‌లోని పలు గ్రామాల ప్రజలు వస్తుంటారన్నారు. నిరక్షరాస్యులైన వారు తమ సమస్యను తెలియజేసేందుకు అర్జీలు రాసే వారు రూ.70 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం పట్టణంలోని వలంటీర్లకు షిఫ్టులు వారీగా డ్యూటీలు వేసి, ఉచితంగా అర్జీలు రాసి ఇచ్చే ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులతో సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి దేవ్‌సింగ్ సెహ్వాగ్

కోట: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కార్యకర్తలకు కేంద్రమంత్రి దేవ్ సింగ్ సెహ్వాగ్ సూచించారు. మండలంలోని సిద్ధవరంలో బీజేపీ నాయకులు దువ్వూరు గిరిరెడ్డి నివాసంలో మధ్యాహ్నం ఆయన కొంత సేపు సేదదీరారు. అనంతరం కోట మండలానికి చెందిన పలువురు కార్యకర్తలతో ఆయన కొద్ది సేపు పలు విషయాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీకి అండగా నిలవాలని కోరాలని తెలిపారు.

తీర ప్రాంతంలో కేంద్రమంత్రి పర్యటన

వాకాడు: మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో సోమవారం కేంద్ర ఐటీ సహాయ మంత్రి దేవ్‌సింగ్ సెహ్వాగ్ పర్యటించారు. ఆయన తూపిలిపాళెంలో ఏర్పాటు చేస్తున్న ఎస్ఐటీని పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామంలోని మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈయన వెంట తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ గోపీనాథ్, జెడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీ వెంకటరమణయ్య ఉన్నారు.

నేదురుమల్లి కుటుంబంపై విమర్శలు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

వెంకటగిరి: నేదురుమల్లి కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి విమర్శించడం సమంజసం కాదని ఆర్టీసీ రీజినల్ కమిటీ మాజీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి ఖండించారు. ఆనం రామనారాయణరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పలువురు సోమవారం విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరిలో వెంకటగిరిరాజాలతోపాటు దివంగత సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులు చేశారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆనం అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అలాగే వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని విమర్శించడం కూడా సరికాదన్నారు. జిల్లా సంయుక్త సహాయకార్యదర్శి చిట్టేటి హరికృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ వైస్ చైర్మన్ పదవులను ఆనం రామనారాయణరెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. కౌన్సిలర్ వహిద, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎస్ సురేష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పీ ప్రసాద్‌రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాసులు, శివయ్య, ఎం జానకిరామ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న సురక్ష



బద్దెవోలులో సర్వేను పరిశీలిస్తున్న పీడీ వెంకట్రావు



సైదాపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ

కలువాయి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నామని నెల్లూరు జిల్లా డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. కలువాయి మండలం పెన్నబద్దెవోలు, కలువాయి సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలును సోమవారం ఆయన జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్ కుమార్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సర్వే ప్రారంభించిన సచివాలయాల పరిధిలో జూలై ఒకటో తేదీన క్యాంపులు నిర్వహిస్తామని, ఇందులో తహసీల్దార్, ఎంపీడీఓ బృందాలు ఇళ్లను సందర్శించి సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి జిల్లాలోని మిగిలిన అన్ని సచివాలయాల్లో ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని, ఆగస్టు ఒకటో తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పథకాలు అందని వారిని గుర్తించి, ఈ సర్వేలో నమోదు చేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి, అర్హత ఉన్న వారికి క్యాంపు నిర్వహణ రోజున సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

సైదాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అనంతమడుగు గ్రామంలో మూడో రోజు సర్పంచ్ కుమారి ఆధ్వర్యంలో సోమవారం జగనన్న సురక్ష పథకంపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళుతూ వారికి వచ్చిన సంక్షేమ ఫలాలు వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య పాల్గొన్నారు.

నేడు వేణుంబాకంలో జగనన్న సురక్ష

దొరవారిసత్రం: వేణుంబాకం సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ సచివాలయం సిబ్బంది వెళ్లి వారి అవసరమైన సర్టిఫికెట్లు గుర్తించడంతో పాటు ప్రభుత్వం నుంచి అందాల్సిన లబ్ధి గురించి కూడా తెలుసుని అందేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. సోమవారం నాటికి నెలబల్లి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తి చేయగా 1,102 సర్టిఫికెట్లు గుర్తించామన్నారు. వీటిని జూలై ఒకటిన ఉచితంగా లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

వెంకటగిరి: జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలు పరిష్కారం అవుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్ భానుప్రియ తెలిపారు. పట్టణంలోని 12వ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుంటే ఈ కార్యక్రమం ద్వారా తక్షణం సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఏ శ్రీనివాసులు, ఎంఎల్ఓ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.